# పత్రికా ప్రకటన

తేది.31.05.2018.

## కిడ్నాప్ డ్రామాతో తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించిన నిందితుడి అరెస్ట్

అన్నదమ్ముల మధ్య నెలకొన్న ఆస్థిపరమైన గొడవలను పురస్కరించుకుని, తనను కిడ్నాప్ చేశారని కుటుంబ సభ్యులకు చెప్పి తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించిన నరేంద్ర సింగ్ (23) అనే వ్యక్తిని ది.31.05.2018న కృష్ణలంక పోలీసులు అరెస్ట్ చేసి, కిడ్నాప్ డ్రామాను ఛేదించడం జరిగింది.

నరేంద్రసింగ్ అనే వ్యక్తి తన కుటుంబంతో కలసి కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధి రాణిగారితోట వద్ద నివసిస్తున్నాడు. నరేంద్రసింగ్ కుటుంబానిది ఉత్తర్‌ప్రదేశ్ కాగా బ్రతుకుదెరువు నిమిత్తం సుమారు 3 సంవత్సరాల క్రితం తన కుంటుంబంతో సహా విజయవాడ వచ్చారు. తన సోదరుడు ఇంద్రసింగ్ మరియు నరేంద్రసింగ్‌లు వీధుల్లో సంచరిస్తూ తోపుడుబండిపై పానీపురి వ్యాపారం చేస్తుంటారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో క్రొత్తగా కడుతున్న ఇంటి గురించి తన తల్లిదండ్రులతో మరియు తన సోదరుడు ఇంద్రసింగ్‌తో నరేంద్రసింగ్‌కు తరచూ గొడవలు జరుగుతుండేవి. గొడవల నేపథ్యంలో తనను కిడ్నాప్ చేశారని కుంటుంబ సభ్యులను నమ్మించడం ద్వారా ఇంటి నుండి బయటకు వెళ్ళిపోదామని నరేంద్రసింగ్ నిర్ణయించుకున్నాడు.

ఈ క్రమంలో నరేంద్రసింగ్ ది.29.05.2018న తన తల్లి గారికి మందులు తీసుకువస్తానని చెప్పి బయటకు వెళ్ళిన నరేంద్రసింగ్ తిరిగి ఇంటికి రాలేదు. మరుసటి ఉదయం 6 గంటల సమయంలో తన అన్న ఇంద్రసింగ్‌కు ఫోన్ చేసి, తనను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి గుర్తుతెలియని సుదూర ప్రదేశంలో నిర్బంధించారని, తనను వదిలిపెట్టాలంటే రూ.3 లక్షలు డిమాండ్ చేస్తున్నారంటూ తెలియజేయడం జరిగింది. దీంతో కంగారు పడిన తన సోదరుడు ఇంద్రసింగ్ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు వచ్చి జరిగిన సంఘటన గురించి తెలియజేస్తూ ఫిర్యాదు చేయడం జరిగింది.

కేసు నమోదు చేసిన కృష్ణలంక పోలీసులు దర్యాప్తులో చేపట్టడం జరిగింది. నరేంద్రసింగ్ తన ఇంటివద్ద నుండి బయలుదేరిన క్షణం నుండి తిరిగిన ప్రదేశాలను వివిధ సీసీ కెమేరాల ఫుటేజ్ పరిశీలించగా అతన్ని ఎక్కడా ఎవ్వరూ కిడ్నాప్ చేసినట్లుగా ఆధారాలు కనబడలేదు. ఇదే కాకుండా పోలీసు విచారణలో ఉన్నప్పుడు వచ్చిన ఫోన్‌కాల్స్ కేవలం నరేంద్రసింగే చేయడం మరింత అనుమానాలకు తావిచ్చింది. నరేంద్రసింగ్ కిడ్నాప్ కాబడినట్లు చెబుతున్న ప్రదేశం, ఫోన్ కాల్స్ వచ్చిన ప్రదేశానికి తేడా ఉంది. పోలీసులు ఈ కేసును సాంప్రదాయ పద్ధతులు మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విశ్లేషించి నరేంద్రసింగ్‌ను ది.30.05.2018న మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో అదుపులోకి తీసుకోవడం జరిగింది. అనంతరం విచారణలో కుటుంబ గొడవల నేపథ్యంలో కిడ్నాప్ అయినట్లు నమ్మించి, కుటుంబ సభ్యులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. ఈ నేపథ్యంలో కిడ్నాప్ డ్రామాతో తప్పుదోవ పట్టించేందుకు ఆడిన నరేంద్రసింగ్‌పై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయడం జరిగింది.

--xx--